నులిపురుగుల మాత్రలు పంపిణీ

విశాలాంధ్ర - కే కోటపాడు : స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఎంపీడీవో సాంబశివరావు నులి పురుగులు మాత్రలు పంపిణీ చేశారు. ప్రపంచ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, వసతి గృహాలు, కస్తూర్బా విద్యాలయాలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రెండు నుండి 19 ఏళ్ల వయసున్న వారు తప్పనిసరిగా ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. నులిపురుగులు ఎంతో ప్రమాదకరమైనవని ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయన్నారు. ప్రతి ఏటా రెండుసార్లు విద్యార్థులు నులిపురుగులు మాత్రలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కే సత్యనారాయణ డివిడి ప్రసాద్ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ శ్రేణులు ప్రజల గొంతుకులై పోరాడాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు

విశాలాంధ్ర - అనకాపల్లి : సమాజ హితం కోసం ప్రజల గొంతుకై సిపిఐ శ్రేణులు పోరాడాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామానాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కోడిగంటి గోవిందరావు భవనలో జరిగిన సిపిఐ అనకాపల్లి జోనల్ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం పేద,మధ్య తరగతి ప్రజలపై ధరాభారాన్ని మోపి, పన్నుల రూపంలో పేద ప్రజల నుండి వసూలు చేసిన దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. దేశంలో మతోన్మాద శక్తులు పేట్రిరిలిపోతున్నాయని, మహిళలకు, పేద ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచ భూమిని వాగ్దానం చేసి పలుమార్లు సర్దుబాటు చార్జీల పేరుతో వినియోగదారులపై పెనుబారం మోపిందని, అంతేకాకుండా ప్రతి ఇంటికి ఆదాని కంపెనీకి చెందిన స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజల నుండి అధిక చార్జీలు వసూలు చేయాలని చూస్తుందన్నారు. ఆదానీ కు ఊడిగం చేస్తూ విద్యుత్ శాఖ నుండి లక్షలాది మందిని ఉద్యోగం నుంచి తొలగించాలని చూస్తుందన్నారు. గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టమని ప్రజలకు చెప్పిన లోకేష్ బాబు ఇప్పుడు మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. రైతులకు సాగుకు నీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ సమస్యలపై ప్రజల గొంతుకలై పోరాడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శ్రీరామదాసు అబ్బులు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, కార్యవర్గసభ్యులు గురు బాబు పాల్గొన్నారు. అనకాపల్లి జోనల్ కార్యదర్శి వై ఎస్.భద్రం కార్యకలాపాలపై నివేదికను ప్రవేశపెట్ట గా ప్రతినిధులు చర్చించి ఆమోదించారు.. తొలితసీనియర్ కమ్యూనిస్టు నేత రెడ్డి రంగారావు పతాకావిష్కరణ చేసి మహాసభలను ప్రారంభించారు. ఈనెల 20 నుండి 25 వరకు ఒంగోలులో జరిగే సిపిఐ రాష్ట్ర మహాసభల కు మన ప్రాంతం నుండి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలి వెళ్లాలని సమావేశం నిర్ణయించింది. మహాసభలో ఆర్టీసీ, అల్యూమినియం, భవన నిర్మాణ, మిల్క్ సొసైటీస్, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం తదితర పార్టీ శాఖల నేతలు బిక్కు బాబు, డి ఎస్ మూర్తి, కర్ణం మాణిక్యాలరావు, ముల్లేటి గోపాల రమణ, పెంట కోట ప్రసాద్, కోరుబిల్లి శంకర్రావు, తాకాసి వెంకటేశ్వరరావు, దొడ్డి సూర్యారావు, బుద్ధ పెంటారావు, పిన్నింటి రాజు, ఆలం శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం పోరు సాగించాలి

విశాలాంధ్ర - అనకాపల్లి : అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద నుండి ర్యాలీగా ప్రారంభమై బస్టాప్ మీద నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం గాజువాక బస్ స్టాప్ వద్ద పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.బాబ్జి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా విచ్చేసి జెండా ఆవిష్కరణ చేసిన ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు మాకి రెడ్డి రామా నాయుడు, రాజాన దొరబాబు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రం మా జన్మ హక్కును ఈ దేశాన్ని పాలిస్తున్నటువంటి బ్రిటిష్ తెల్ల దొరల తరిమి కొట్టడం కోసం ఆవిర్భవించిన సంఘం ఏఐఎస్ఎఫ్ అని కొనియాడారు. 1936 ఆగస్టు 12న ఉత్తర్ ప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో బెనారస్ విశ్వవిద్యాలయంలో ఆవిర్భవించి విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతంగా పోరాటం నిర్వహించి నేటికి 90 సంవత్సరాలు కావస్తుందని విద్యార్థులు లోకానికి తెలియజేశారు. విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లోకి విద్యార్థి నాయకులు రాజకీయ పార్టీలు అనుమతులేదని

తీసుకువచ్చిన జీవోలు ఎవరికోసం ఎవరి లబ్ది కోసమని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని కోరారు. దేశంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం విద్యను కాషాయ కరణ చేయడానికి ప్రయత్నం చేస్తుందని మండి పడ్డారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన వారి చరిత్రను చెరిపివేసి దేశం కోసం బ్రిటిష్ వారికి తొత్తుగా పనిచేసిన వారి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడాన్ని తప్పు పట్టారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్న సందర్భంలో విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చారని ఆ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకంలో చాలా శరతులు పెట్టడం వల్ల చాలామంది విద్యార్థులకు అందలేదని పేర్కొన్నారు. కాబట్టి విద్యార్థి లోకం వారి హక్కుల కోసం ప్రభుత్వాలను ప్రశ్నించవలసిన బాధ్యత ప్రస్తుత పరిస్థితుల్లో ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ. ప్రభుత్వ బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని పెరిగిన ధరలకు అనుగుణంగా మేస్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు, విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా నేటికీ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించకపోవడం దారుణమని మండిపడ్డారు. యువగలం పాదయాత్రలో పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మన ప్రభుత్వ అధికారంలోకి వస్తే వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయకుండా జీవో నెంబర్ 107 108 రద్దు చేస్తామని చిన హామీని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం విద్యార్థులు సమరశీల పోరాటాలు రాబోయే కాలంలో నిర్వహించేందుకు సిద్ధం కావాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు అదేవిధంగా అనకాపల్లి జిల్లా కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కొరకు భవిష్యత్తులో ఉద్యమిస్తామని, ప్రభుత్వ విద్య కాపాడుకునేందుకు ఏఐఎస్ఎఫ్ నిరంతర ఉద్యమాలకు సిద్ధంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జి.గురుబాబు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రాజు,ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జగదీష్ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ రంగనాథన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - కశింకోట : తాళ్లపాలెం శాఖగ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ శాస్త్ర పితామహుడు (ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకొని లైబ్రేరియన్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ,రిటైర్డ్ లైబ్రరియన్స్ జి. మురళీకృష్ణ, ఆర్. కన్నబాబు, హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. తాళ్లపాలెం శాఖ గ్రంధాలయ అధికారికే జగన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగుల దినోత్సవం

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట : జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకుని మండలంలో తురకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న సీతయ్యపేట, పెదపూడి, చింత పాక, పి.పి.అగ్రహారం కరక తదితర గ్రామాల్లో ఉన్న పాఠశాలలో డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగులు నివారణ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా దుతూ పిల్లలలో శారీరకంగా మానసికంగా ఎదుగుదలకు అడ్డంటిగా మారిన నులి పురుగులకు నివారణ ఒక్కటే మార్గమని పిల్లల కడుపులో నులి పురుగులు చేరి రక్త హీనత, ఆల్బెండోజెల్ మాత్రలు వేసుకోవడం వలన నులిపురుగులు నశించి ఆరోగ్య వంతమైన జీవనం లభిస్తుందని తురకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సంధ్యా రాణి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దాకవరపు నాగేశ్వరీదేవి, జడ్పీటీసీ సభ్యులు దొండా రాంబాబు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ కోరుకొండ రవి కుమార్తో వివిధ గ్రామాల సర్పంచ్లు, స్కూల్ కమిటీ చైర్మన్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం

విశాలాంధ్ర - నక్కపల్లి : మండలంలో పెదబోదుగల్లం హైస్కూల్ లో మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవాన్ని హెచ్.ఎమ్. ఎస్.జయశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక వైద్య సిబ్బంది పి.నాగమణి విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పించారు. నులిపురుగులు శరీరంలో చేరకుండా ఉండాలంటే ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు శ్రద్ధ వహించాలని, ఇప్పటికే పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. మనం ఉపయోగించే ఆహార పదార్థాలు, నీటిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, ఆకలిలేక పోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఎక్కువగా ఉంటాయన్నారు. హెచ్.ఎమ్.ఎస్.జయశ్రీ మాట్లా డుతూ చేతి గోళ్ళను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, ఆహారం తిన్న తరువాత, తినక ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బయట తిరిగేటప్పుడు చెప్పులు ధరించాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎన్.ఎమ్.నాగమణి, ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, ఎస్.ఫాల్గుణరావు, కుమారి, వి.పద్మావతి తదితరులు పాల్గొని విద్యార్థులకు ఆరోగ్య సూచనలు అందించారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపించాలి

విశాలాంధ్ర - కే.కోటపాడు : ప్రకృతి వ్యవసాయం పై రైతులు అవగాహన పెంచుకొని, దిగుబడులు సాధించాలని స్థానిక వ్యవసాయ అధికారి సోమశేఖర్ అన్నారు. మంగళవారం ఆర్ వై అగ్రహారం కేజేపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రసాయన ఎరువులు , పురుగు మందులుకు బదులుగా ప్రకృతి వ్యవసాయంలో జీవామృతాలు వాడి మంచి దిగుబడులు పొందాలన్నారు. అన్నదాత సుఖీభవ పి ఎం కిసాన్, కౌలు రైతు ధ్రువ పత్రాలు తదితర అంశాలపై వివరించారు.. సమావేశం అనంతరం ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని రైతులకు చేసి చూపించారు. ఈ కార్యక్రమం లో మండల ప్రకృతి వ్యవసాయం కో ఆర్డినేటర్ పాత్రుని నాయుడు రెండు గ్రామాల ఉప సర్పంచ్ లు లెక్కల అచ్చి బాబు, గొర్లి అప్పారావు, రైతులు శ్రీనివాస రావు, గునూరు సత్యనారాయణ వివిఏ కళ్యాణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

విశాలాంధ్ర - సబ్బవరం : జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో స్థానిక పిహెచ్సి వైద్య సిబ్బంది, కళాశాల ప్రిన్సిపల్ బి.శంకర్ సమక్షంలో మంగళవారం విద్యార్థులకు ఆల్బెండజైజేషన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ బి.శంకర్ మాట్లాడుతూ నులిపురుగులు నిర్మూలన అనేది చాలా కీలకమైన అంశమని, ఇది ఆరోగ్యం పై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోందని ముఖ్యంగా రక్తహీనత కలిగిస్తుందని కాబట్టి ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా మాత్రలు వేసుకోవాలని తద్వారా ఆరోగ్యంగా ఉండాలని ఈ సందర్భంగా విద్యార్థులను కోరారు.ఈ కార్యక్రమంలో, ఎంఎల్పిహెచ్ కే. శాంతి కుమారి,హెల్త్ సూపర్వైజర్ సిహెచ్ రత్నం,కళాశాల, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి డాక్టర్ గణేష్ లెక్కల, కళాశాల కంప్యూటర్ అధ్యాపకులు జామి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కొప్పుగొండుపాలెం, రాంబిల్లి గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది'

విశాలాంధ్ర - రాంబిల్లి : మండల కేంద్రమైన రాంబిల్లి, కొప్పుగొండుపాలెం గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయాధికారి సి.సుమంత ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కొబ్బరి తోటల మధ్యలో పచ్చిరొట్ట నిచ్చే జీలుగ, జనుము అపరాలు, మొక్కజొన్న, నువ్వులు అంతం పంటలగా సాగు చేయడం వలన భూసారం పెరగడమే కాకుండ ఆదాయం వస్తుంది. అదే విధంగా జీవన ఎరువులైన అజటోబాక్టర్, రైజోబియం, ఫాస్ఫరస్, పొటాష్ కరిగించేవి వాడటం ద్వార భూసారం పెరగడమే కాకుండ 25% రసాయన ఎరువుల కోసం పెట్టే ఖర్చు ఆదా అవుతాయని మండల వ్యవసాయాధికారి సి.సుమంత తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వి.ఏ.ఏ కోటేశ్వరరావు, వి.హెచ్.ఏ.అనిల్, రైతులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం : రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత

విశాలాంధ్ర - యస్.రాయవరం : రాష్ట్రంలో రైతుల సంక్షేమ కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం మండలంలోని ఎస్ రాయవరం నుంచి వెంకటాపురం వరకు అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం ఆధ్వర్యంలో భారీ ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు . ఈ సందర్భంగా వెంకటాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో రైతులకు 13500 ఇస్తే ఈ ప్రభుత్వము మూడు విడతలగా అన్నదాత సుఖీభవ పేరుతో 20 వేల రూపాయలు జమ చేస్తున్నామన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసే విధంగా ఆధునీకరణ దశగా ప్రభుత్వము చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగానే డ్రోన్స్ వినియోగం టెక్నాలజీ ఆధారిత పద్ధతులు సేంద్రియ వ్యవసాయ ప్రోత్సాము జరుగుతుందన్నారు. ఎప్పుడూ లేని విధంగా రైతులు పండించిన వరి పంటకు ప్రభుత్వము కొనుగోలు చేసి 24 గంటల్లోపే నగదును జమ చేయడం జరుగుతుందన్నారు. వెంకటాపురం గ్రామంలో సుమారు మూడు కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి చేయడం జరిగిందని ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఉప్పరాపల్లి నుంచి వెంకటాపురం తారు రోడ్డు నిర్మాణం ఈ ఈ సంవత్సరకాలంలోపు పూర్తి చేశామన్నారు. మహిళల ఉపాధి కోసం ప్రత్యేక దృష్టి సారించడం ఈ నియోజకవర్గంలో అనేక పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయని అందులో భాగంగా ఉపాధి కలుగుతుందన్నారు ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు పథకం అమల్లోకి వస్తుందని మహిళల కోసం ఇచ్చిన హామీ మేరకు ఈ పథకమును ప్రారంభిస్తారని వారి ప్రయాణించే బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారన్నారు. అనంతరము గ్రామంలోని టిడిపి కార్యాలయం ప్రారంభించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. తారు రోడ్ల నిర్మాణం ప్రారంభంతో పాటు గోకులం షెడ్లను ప్రారంభించారు వ్యవసాయ శాఖ ఏర్పాటుచేసిన స్టాల్స్ ను పరిశీలించారు. అంతకుముందు ఎస్ .రాయవరంలో నూకంబిక అమ్మవారిని దర్శించుకున్నారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు ,డీసీఎంఎస్ చైర్మన్ బాలాజీ, ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, జడ్పీటిసి కాకర దేవి, గ్రామ సర్పంచ్ కొప్పిశెట్టి సత్యం, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ ,టిడిపి నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ,జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మాజీ ఎంపీపీ వై .వినోద్ రాజు ,పిఎసిఎస్ చైర్పర్సన్ తుమ్మపాల నాగేశ్వరరావు, గుర్రం రామకృష్ణ, కొప్పిశెట్టి బుజ్జి, రెడ్డి పవన్ కుమార్, టిడిపి సీనియర్ నాయకులు ఎస్. వెంకట్రాజు ,కురందాసు నూకరాజు, కందుల వెంకటేశ్వరరావు ,దండు అచ్యుతరామరాజు ,అల్లు నరసింహమూర్తి ,మరిశా త్రిమూర్తులు ,ముప్పిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి పోలీసు స్టేషన్ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర - రాంబిల్లి : రాంబిల్లి పోలీస్ స్టేషన్ ను మంగళవారం అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు,అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకుని, స్టేషన్ పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేసి ఎక్కువగా నమోదవుతున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారం ప్రాధాన్యతగా విధులుండాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో నేరల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, నేరాల నియంత్రణకై పెట్రోలింగ్,విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తే సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.నేర నియంత్రణలో భాగంగా అవసరమైన ప్రతీ చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అందుకు అనుగుణంగా ప్రజలకి వాటి ద్వారా కలిగే ప్రయోజనాలని అవగాహన కల్పించాలన్నారు.పారిశ్రామిక ప్రమాదాలు పట్ల (ఎస్.ఓ.పి) స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగించాలని, కొత్త వ్యక్తులు, అనుమానస్పద వ్యక్తుల కదలికల సమాచారం ముందస్తుగా తెలుసుకునే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సముద్ర స్నానాలు చేసే యువత హెచ్చరికలు జారీ చేయాలని స్థానిక మత్స్యకారులతో కలసి కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. రాంబిల్లి సిఐ సి.హెచ్.నర్సింహారావు, ఎస్సై నాగేంద్ర, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలి

విశాలాంధ్ర - సబ్బవరం : 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలందరూ తప్పకుండా నులిపురుగుల నివారణ మాత్రలను వేసుకోవాలని ఇంచార్జ్ ఎంపీడీవో కే.శివ నారాయణ ప్రసాద్ సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలను వైద్యలతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల ద్వారా పిల్లల్లో శారీరక ఎదుగుదల ఉండక పోవడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పకుండా నులివురుగుల నివారణ మాత్రలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, డాక్టర్ సిహెచ్.ఆశ, వై.స్వర్ణలత, సిహెచ్ఓ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - పరవాడ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి లాంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని పరవాడ పోలీస్ ఇన్ స్పెక్టర్ ఆర్. మల్లికార్జున రావు అన్నారు. మంగళవారం ముత్యాలమ్మపాలెం జడ్పీ హైస్కూల్లో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ మాట్లాడుతూ గంజాయి మత్తు వంటి మత్తు పదార్థాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, అలాంటి విక్రయాలు, సేవించే వారికి దూరంగా ఉండాలని సూచించారు. క్రమశిక్షణతో విద్యలో రాణిస్తూ విజ్ఞానాన్ని సంపాదించేందుకు కృషి చేయాలని అదే ఉన్నతమైన స్థానంలో నిల బెడుతుందన్నారు. మత్తు అలవాట్లకు పాల్పడిన వారిని గమనించినా లేదా సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఎవరైనా విద్యార్థులకు మత్తు పదార్థాలు అందజేసినా, వాడించడానికి ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులపై తరచూ నిఘా ఉంచాలని, స్కూల్ పరిసరాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా హెచ్ఎం కు సూచించారు. ఈ క్రమంలో కొందరు విద్యార్థులు క్రమశిక్షణ లేకుండా ఉంటున్నారని హెచ్ఎం ఇన్ స్పెక్టర్ కు వివరించారు. దీనిపై విద్యార్థులు క్రమశిక్షణతో పాటు మంచి ప్రవర్తన అలవర్చుకోవాలని ఇన్స్పెక్టర్ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహాలక్ష్మి, హెచ్ఎం అప్పలరాజు, పిఈటి వి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్.రాయవరం ఎంపీపీ ఎన్నిక

విశాలాంధ్ర - యస్.రాయవరం : ఎస్.రాయవరం మండల పరిషత్ అధ్యక్షుడు పదవికి ఎన్నిక ఏర్పాట్లు మండల అధికారులు చేశారు .రెండు నెలల క్రితం ఎంపీపీ పదవికి కొరుప్రోలు ఎంపీటీసీ వెంకటలక్ష్మి రాజీనామా చేయడంతో ప్రస్తుతం ఎంపీపీగా వైస్.ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు కొనసాగుతున్నారు. నెలరోజుల క్రితం ఎన్నికల కమిషన్ ఎంపీపీ ఎన్నిక నోటిఫికేషన్ ఇవ్వగా కోరం లేకపోవడంతో రెండు దఫాలు వాయిదా పడింది. అయితే ఇటీవల ఎన్నికల కమిషన్ మరలా ఎన్నిక నిర్వహించాలని ఆదేశించడంతో మండల ఎన్నికల అధికారి మనోరమ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహిస్తారు. అయితే ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుత ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. బీసీ మహిళ కు కేటాయించిన ఈ పదవి రాజకీయ పరిణామాల నేపథ్యంలో పూర్తి మెజార్టీతో వైసీపీ లో గెలిచిన ఎంపీటీసీల నిర్ణయం ఏ విధంగా ఉంటాదో తెలియని పరిస్థితి ఉంది. వైసీపీ నుంచి పోటీ పెట్టాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. మొదటి నుంచి ఎంపీటీసీల మద్దతుతో ఉన్న పార్టీకి రాజీనామా చేసిన బొలిశెట్టి గోవిందరావు దే కీలక నిర్ణయం.

భార్గవి కంపెనీలో అమ్మోనియా గ్యాస్ లీక్.. అస్వస్థకు గురైన ప్రజలు

విశాలాంధ్ర - పరవాడ : పరవాడ మండలం ఈ భోనంగి ఇండస్ట్రియల్ పార్కులో గల భార్గవి అమో నియా కంపెనీలో మంగళవారం మధ్యాహ్నం ప్రమాదం చోటు చేసుకుంది. ఈ కంపెనీలో అమోనియా గ్యాస్ లీక్ అవడంతో సమీపంలోని బొద్దపువానిపాలెం గ్రామస్తులు అస్వస్థకు గురయ్యారు. దీంతో స్థానికులు పీల్చుకోవడానికి తీవ్ర అవస్థలు పడ్డారు. మరికొందరు ఏమైందో తెలియక పరుగులు తీశారు. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఇదిలా ఉంటే ఇదే భార్గవి కంపెనీ యాజమాన్యం ఎప్పటికప్పుడు రాత్రి వేళల్లో గ్యాస్ విడుదల చేస్తుందని, దీని వల్ల శ్వాస కోస వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. పీసీబీ అధికారులు, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సమగ్ర విచారణ జరిపించి కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, వైఎస్ఆర్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, స్థానిక నాయకులు చందక కృష్ణ, ఇరోతి రమేష్, బొద్దపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అలాగే ఇక్కడి నుంచి ఈ కంపెనీని గ్రామానికి దూరంగా తరలించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

అచ్యుతాపురం పోలీస్ స్టేషన్ను తనిఖీ చేసిన ఎస్పీ

విశాలాంధ్ర - అచ్యుతాపురం : జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా మంగళవారం అచ్యుతాపురం పోలీస్ స్టేషన్లో తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు, పెండింగ్ కేసులను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల ఫింగర్ ప్రింట్స్ సేకరించి, గ్రామాల్లో గస్తీ ముమ్మరం చేయాలన్నారు. శాంతి భద్రతలు కాపాడేందుకు రౌడీ షీటర్లు, చెడు నడవడిక కలిగిన వ్యక్తులపై నిఘా పెంచి, మంచి నడవడికవైపు అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ నమ్మి గణేష్ , ఎస్ఐలు జి సుధాకర్, ఎమ్ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దేవరాపల్లిలో మెగా ఉద్యోగ మేళా

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : జిల్లాలో గల మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో బుధవారం భాగంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్. గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదోతరగతి, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ చదివి 18 నుంచి 35 ఏళ్లు లోపు ఉన్న యువతీ యువకులు అర్హులన్నారు. అభ్యర్థులు ముందుగా నైపుణ్యం యాప్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరములను వెబ్ సైట్ https://naipunyam .ap.gov.in/user-registrationలో నమోదు చేసుకోగలరని జిల్లా నైపుణ్యా భివృద్ధి అధికారి గోవిందరావు తెలియజేశారు. మరిన్ని వివరాలకు 81063 27482 నంబరుకు కాల్ చేసి సంప్రదించాలన్నారు.

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

విశాలాంధ్ర - గొలుగొండ : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు మాత్రలు వేయించడం జరిగిందని గొలుగొండ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్యామ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన గోల్కొండ యూపీ పాఠశాలలో జాతీయ నులిపురుగుల దినోత్సవంను పరిష్కరించుకొని విద్యార్థులకు నివారణ మాత్రలు వేయించడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్యాం కుమార్ మాట్లాడుతూ నులిపురుగులు నివారణకు నివారణ మాత్రలు తప్పనిసరిగా విద్యార్థులందరూ వేసుకోవాలని వారు వేసుకునే విధంగా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కీర్తి మండల విద్యాశాఖ అధికారి 2 గాలి కృష్ణ ప్రసాద్ వైద్య సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్‌కు భూములివ్వం

ల్యాండ్ పూలింగ్ కు భూములిస్తే జీవనోపాది కోల్పోతాం
తేల్చి చెప్పిన ఎ. సిరసపల్లి, బంగారమ్మపాలెం రైతులు
బలవంతపు భూసేకరణ చేస్తే ఆత్మ హత్యలే శరణ్యం

విశాలాంధ్ర - సబ్బవరం : ల్యాండ్ పూలింగ్‌కు భూములిస్తే జీవనోపాది కోల్పోతామని, ఎట్టి పరిస్థితులలోనూతాము ల్యాండ్ పూలింగ్ కు భూములు ఇవ్వబొమని మండలంలోని ఏ. శిరసపల్లి,బంగారమ్మ పాలెం రైతులు స్పష్టం చేసారు. ఈ మేరకు మండల కేంద్రంలోని స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు కు ఆయా గ్రామాల రైతులు వినతి పత్రం అందజేసి ఆవేదన వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ నెల 7న ఎ. సిరసపల్లి, బంగారమ్మ పాలెం రైతులకు గ్రామసభ నిర్వహించి రెవిన్యూ అధికారులు ల్యాండ్ పూలింగ్ కు భూములు ఇవ్వాలని తెలిపారని, అయితే తమ జీవనోపాధి కి ఆ భూములే ఆధారమని వారు అధికారులకు చెప్పి, ఎట్టి పరిస్థితులలోనూ భూములు ఇవ్వమని తేల్చి చెప్పారనిఎమ్మెల్యే కు తెలిపారు. తాము సుమారు 250 కుటుంబాలు ఈ భూములు ఆధారంగానే జీవనం సాగిస్తున్నమన్నారు. ఈ భూముల్లో జీడీ, మామిడి తోటలు, పశువులు మేపుకొని జీవిస్తున్నామన్నారు. తమ జీవనాధార మైన భూములు ప్రభుత్వం తీసుకుంటే తాము ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. అయితే గత ప్రభుత్వం హయాంలో ల్యాండ్ పూలింగ్ కు బలవంతపు భూసేకరణ చేయరాదని హైకోర్టు తీర్పు వెలువరించింది. అయినప్పటికీ గత ప్రభుత్వం హయాంలో ఆయా గ్రామాల నేతలు రైతులకు కల్లబొల్లి కబుర్లు చెప్పి ల్యాండ్ పూలింగ్ కు అనుకున్న లక్ష్యం ప్రకారం భూములు సేకరించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ల్యాండ్ పోలింగ్ భూ సేకరణకు ఎటువంటి నిబంధనలు విడుదల చేయకుండా ఎలా భూ సేకరణ చేస్తుందని పలువురు ప్రశ్నిస్తున్నారు.గత వైసీపీ ప్రభుత్వం నిబంధనలనే కూటమి ప్రభుత్వం పాటిస్తుందా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. 2013 భూసేకరణచట్టం ప్రకారం రైతులకు పరిహారం తో పాటు ఉపాధి కల్పించాలని చట్టంలో ఉంది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పంచకర్ల వెంటనే వి ఎం ఆర్ డి ఎ కమిషనర్,అనకాపల్లి జిల్లా కలెక్టర్ కు ఫోన్లో మాట్లాడి ఏ శిరసపల్లి,బంగారమ్మ పాలెం గ్రామాలలో ల్యాండ్ పూలింగ్ కోసం భూసేకరణ సర్వేను నిలిపివేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రజా అవసరాలకు ప్రభుత్వానికి రైతులు భూములు ఇవ్వవలసి ఉంటుందని, రైతులకు గతంలో కంటే ఎక్కువ నష్టపరిహారం వచ్చేటట్లు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రైతులకు అన్ని విధాల న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఏది ఏమైనప్పటికి రైతులు తమ జీవనోపాధికి ఆ భూములే ఆధారమని తాము భూములను ల్యాండ్ పూలింగ్ కు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వబోమని రైతుల స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు, టీడీపీ సీనియర్ నేత దొడ్డి సూర్యప్రకాశరావు, మాజీ పాల సొసైటీ అధ్యక్షుడు ఎస్. మూలి నాయుడు,పలువురు రైతులు, జనసేన నేతలు బలిరెడ్డి అప్పారావు, కర్రి కనకరాజు, బంతి కోళ్ల పద్మ, పల్లి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉరలోవకొండ చుట్టు గల భూములు వెబ్ లెండ్‌లో చేర్చించాలి

విశాలాంధ్ర - వి.మాడుగుల : మాడుగులం మండలం ఒమ్మలి, జగన్నాదపురం, కృష్ణాపురం, రావికమతం మండలం కొమిరి గ్రామాల్లో 6వ విడత భూ పంపిణీలో ఉరలోవ కొండ 450 మందికి పట్టాలు ఇచ్చిన భూములకు సర్వేనెంబర్లు సరి చేసి వెంటనే వెబ్ లెండ్‌లో నమోదు చేయాలని కోరుతూ మంగళవారం విజయవాడ(అమరావతి)లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా ప్రదాన కార్యదర్శి డి.వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం మాడుగుల మండల కార్యదర్శి కె.భవాని తదితరులు సిసిఎల్ జి.జయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. 6వ విడత భూపంపిణీలో ఉరవకొండ చుట్టు వందలాది మంది పెదలకు గిరిజనులకు దళితులకు నాటి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందని తెలిపారు. పట్టాలు ఇచ్చిన సర్వే నెంబర్లు గల ఏ భూములు వెబ్ ల్యాండ్‌లో నమోదు అవ్వ లేదన్నారు. పట్టాలు ఇచ్చిన సర్వే నెంబర్లకు పేదలు సాగులో ఉన్న సర్వే నెంబర్లుగల భూములకు సంభంధం లేదని తెలిపారు. దీని వలన పట్టాదార్లు అందరు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాలు వలన పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాటు ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు, స్కీములు అమలు కావడం లేదన్నారు. 2016 వ సంవత్సరం నుండి అనేక పర్యాయాములు మాదుగులం తహశీల్దార్, జిల్లా కలెక్టర్‌కు గ్రామాల్లో జరిగిన రైవెన్యూ సదస్సుల్లో అనేక సార్లు ధరఖాస్తులు పెట్టుకున్నారని తెలిపారు. దీంతో జిల్లా కలెక్టర్ అమరావతి సిసిఎల్‌కు సమస్య పరిష్కారం కోసం వ్రాయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా సర్వే నెంబర్లు సరి చేసి వెబ్‌ల్యాండ్‌లో వెంటనే నమోదు చేయాలని, ఇప్పటికే సాగులో ఉండి పట్టాలు ఇవ్వరి వారందరికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఈభూముల పై అదార పడ్డ పేదలు అందరు ఇప్పటికే గత 40 సంవత్సరాలుగా సాగులో ఉన్నారని తెలిపారు. ఈ భూముల్లో జీడీ మామిడి ఇతర పంటలు పండించు కుంటు జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సిసిఎల్ స్పందించి వెంటనే పేదలకు ఇచ్చిన భూములు అన్ని సర్వే నెంబర్లు సరిచేసి వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని వినతిపత్రంలో వారు కోరారు.

స్వయం భూ కార్యసిద్ధి గణపతి ఆలయంలో సంకష్టహర చతుర్థి వేడుకలు

విశాలాంధ్ర - చోడవరం : రాష్ట్రంలోని స్వయం భూ దేవాలయాలు అన్నింటిలో అత్యంత మహిమాన్వితమైన, చరిత్ర ప్రసిద్ధి చెందిన అనకాపల్లి జిల్లా చోడవరం స్వయం భూ కార్యసిద్ధి గణపతి దేవస్థానంలో శ్రావణ బహుళ చవితి, సంకట హర చతుర్థి పర్వదినం పురస్కరించుకుని మంగళవారం భక్తులు, మహిళలు, పుర ప్రముఖుల చే సామూహికంగా లక్ష్మి గణపతి హెూమం నిర్వహించారు. సర్వ శ్రేయోభివృద్ధికి వేకువ జామునే భక్తులచే మహా గణపతికి పురుష సూక్త విధానంలో పంచామృత అభిషేకములు, గణపతి అధర్వణ శీర్షం తో ప్రత్యేక పూజలు, అనంతరం సామూహిక లక్ష్మి గణపతి హెూమం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచలి చలపతిరావు తెలియజేసారు. శ్రావణ బహుళ చతుర్థి రోజున వచ్చే మహా సంకట హర చతుర్థి చాలా విశేషమని ప్రధాన అర్చకులు తెలిపారు. ఉద్యోగ అవకాశాలు, భూమి విషయంగా ఇబ్బందులు, నష్ట ధన ప్రాప్తి కొరకు లక్ష్మీ గణపతి హెూమం .... గణపతి అధర్వశీర్షం గణపతి ఉపనిషత్ పారాయణ సంకల్పం.... ఈ సంకల్పం చేసుకొని, ఇలా సమస్యలు ఉన్నాయి అనుకున్న వారు సాయంత్రం వరకు ఉపవాసం ఉండి పారాయణం చేసుకోవాలి అని తెలియ జేశారు. వినాయక చవితికి ముందుగా వచ్చే సంకటహర చతుర్థిని లిమహా సంకటహర చతుర్థి అని అంటారులి అని తెలియజేశారు. ఉద్యోగం, భూ సమస్యలు, ఇల్లు కడుతుండగా ఆటంకాలు, మనం డబ్బులు ఇచ్చి తిరిగి రాకుండా ఉండడం నష్ట ద్రవ్యం కొరకు ఈ సంకల్పం చేయాలి.

నులిపురుగుల మాత్రలు పంపిణీ

విశాలాంధ్ర - నాతవరం : జాతీయ నులి పురు గుల దినోత్సవం సందర్భంగా మంగళవారం నాడు స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ నందు పిల్లలకు ఆల్బె ండ జోల్ మాత్రలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ జి రామ్ గోపాల్, ఎంపిహెచ్ఈవో కోరుప్రోలు వెంకట్ రమణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మౌనిక పాల్గొన్నారు.

పేదరికం లేకుండా చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యం

విశాలాంధ్ర - అచ్యుతాపురం : పేదరికం లేకుండా చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని హెూం మంత్రి అనిత అన్నారు . మంగళవారం స్థానిక సెజ్ లో గల ఎంఎస్ఎంఈ భవనంలో పారిశ్రామికవేత్తలతో నిర్వ హించిన పీ - 4 సమావేశంలో హెూం మంత్రి అనిత ముఖ్య అతథిగా హాజరయ్యారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదరికం నిర్మూళలనలో ప్రతీ ఒక్కరి భాగస్వామ్యం అవసరమన్నారు. ఎన్డియే ప్రభుత్వంలో పారిశ్రామీకవేత్తలు కూడా ఒక భాగమేనని, పరిశ్ర మలకు ప్రభుత్వం అన్ని విధాలగా సహక రిస్తుం దన్నారు. పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలన్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగాలు సకాలంలో జీతాలు ఇవ్వలేదని, ఎన్డియే ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేథికే జీతాలు ఇస్తున్నామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

ఎం.కోడూరులో ఉచిత కంటి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - వి.మాడుగుల : మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామంలో మంగళవారం సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో క్యాంప్ ఆర్గనైజర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 120 మంది వరకు వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. శస్త్ర చికిత్స అవసరం వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. అనంతరం కొంత మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ముమ్మిన రమణబాబు, జల్లి హరిప్రసాద్, కలిమి గోపాల్, పొతిన జగదీష్, అప్పాన నాయుడు పాల్గొన్నారు.

కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకొని జీవనోపాధి పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - మునగపాక : మండలంలో ఒంపోలు గ్రామంలో డిఆర్డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ డా.శచిదేవి మంగళవారం సందర్శించారు.మహిళలతో సమావేశమై 2.0 మన డబ్బులు మన లెక్కలులో కార్యక్రమంలో భాగంగా ఒంపోలు గ్రామంను పైలట్ ప్రాజెక్టు పరిధిలోకి తీసుకొని గ్రామంలో ఉన్న స్వయం సహాయక సంఘాలు అన్ని ప్రతి నెల సమావేశాలు పెట్టుకొని పుస్తక నిర్వహణ చేసుకుని మ్బైబైల్ ఫోన్ లో నమోదు చేసిన వెంటనే ప్రతి మహిళ కి వారి వారి ఫోన్ లకు మెసేజ్ అలర్ట్ వస్కుందని అన్నారు. ఎవరి డబ్బులు ఎంత ఉంది అనేది సభ్యులకు తెలుస్తుందని చెప్పడం జరిగింది. అలాగే ప్రతి మహిళా జీవనోపాధి మెరుగు పరచడానికి కొత్త కొత్త వ్యాపారాభి దవృద్ధి కార్యక్రమాలు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న రోజుల్లో ప్రతి ఒక్కరు ప్రపంచంతో పోటీ పడాలని ముందు ముందు కొత్త కొత్త టెక్నాలజీలు వస్కున్నాయని వాటి అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలరాజు సీసీలు రామకృష్ణ, వేణు, వివోఏ చిన్నమ్మలు మహిళల అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఆన్లైన్ బెట్టింగ్ ద్వారా యువత జీవితాలు నాశనం

మునగపాక సబ్ ఇన్స్పెక్టర్ పి.ప్రసాదరావు

విశాలాంధ్ర - మునగపాక : ఆన్లైన్ బెట్టింగ్ ద్వారా యువత తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని మునగపాక సబ్ ఇన్స్పెక్టర్ పి. ప్రసాదరావు తెలిపారు.మండలంలో అరబుపాలెం గ్రామంలో సైబర్ నేరాలపై గ్రామస్తులుకు అవగాహన కార్యక్రమం మంగళ వారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెట్టింగ్ అంటే జూదమేనని, బెట్టింగ్లో లక్షలాది రూపాయలు కోల్పోయి అనేకమంది యువకులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు.ఆన్లైన్ గేమింగ్లు సమాజంలో యువతరాన్ని పెడతోవ పట్టిస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.బెట్టింగులు ఆన్ లైన్ ద్వారా కాస్తు ఆన్ లైన్ లో నగదు బదిలీ చేసే వారిపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రత్యేక నిఘా పెడుతుందన్నారు. క్రికెట్ పోటీలు చూసి ఆనందించాలని బెట్టింగులు జోలికి వెళ్తే అప్పుల పాలై కుటుంబాలను,జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు. సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆత్యాశతో బెట్టింగులకు పాల్పదుతుంటారని, తల్లిదండ్రులందరూ పిల్లలు మొబైలను ఏ విధంగా వాడుతున్నారో పరిశీలిస్తుండాలని సూచించారు. మండలంలో ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమాలు జరుగుతుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ పి.ప్రసాదరావు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగుల దినోత్సవం

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట : (నేషనల్ డి వార్మింగ్ డే) సందర్భంగా బుచ్చయ్యపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోగల దిబ్బిడి హై స్కూల్ విద్యార్థులకు , వైద్యుధికారులు డాక్టర్ కె.వి.కృష్ణ, డాక్టర్ కె.రమేష్ ప్రధాన ఉపాధ్యాయులు సత్యరావు ఆధ్వర్యంలో సమక్షం లో ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరిగినది.బుచ్చయ్యపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల 28 స్కూల్లో 26 అంగన్వాడి సెంటర్ లో ఉన్నటువంటి 1 సం. నుండి 19 సంవత్సరాల పిల్లలు, మొత్తం 3066 మంది పిల్లలకు కాను 2939 పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరిగింది. మాత్రలు వేసుకోని పిల్లలకు 20వ తేదీన మాపప్ డే రోజున వేయడం జరుగుతున్నదని వైద్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ కె.వి.కృష్ణ, డాక్టర్ కె.రమేష్ ఉపాధ్యాయులు, సత్య రావు కిరణ్ కుమార్.హెల్త్ సిబ్బంది .దేముడు హెల్త్ సూపర్వైజర్ మామిడి రామకృష్ణ రామేశ్వరి అప్పలనరసమ్మ సుబ్బలక్ష్మి ఆశా కార్యకర్త లక్ష్మి. పాల్గోన్నారు.

నులిపురుగుల నివారణకు ప్రత్యేక చర్యలు : జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

విశాలాంధ్ర - యస్.రాయవరం : పిల్లల ఆరోగ్యంగా ఉండేందుకు నులిపురుగుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. మండలంలోని లింగరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా విద్యార్థులకు ఆల్బెండ జోల్ మాత్రలను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులి పురుగుల నుంచి రక్షణగా ప్రతి విద్యార్థి తమ గోళ్ళ ను చేతులను శుభ్రం చేసుకోవాలని అంతే కాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని సురక్షితమైన నీరు త్రాగడం వల్ల ఇటువంటి సమస్య రాదని తెలియజేశారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయకుండా శుభ్రమైన మరుగుదొడ్లు ఉపయోగించాలని సూచించారు. అనంతరం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు, డిప్యూటీ డిఇఓ పి. అప్పారావు , ఎంపీడీవో సత్యనారాయణ, తహసిల్దార్ జె. రమేష్ బాబు ,గ్రామ సర్పంచ్ ఉదయ కుమారి, ప్రధానోపాధ్యాయురాలు గీత, స్థానిక వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.